శ్రీకాష్

# పిటిబ్బి

ఆ రోజు కొత్త సినిమా విడుదలయింది.

నిలువెత్తు కటవుట్లు. పొడుగాటి బ్యానర్లు. రంగురంగుల పోస్టర్లు. అభిమాన కథానాయకుడి బొమ్మకి దండలు. రకరకాలైన విద్యుద్దీపాల కాంతులు-సినిమా థియేటరు కళకళలాడి పోతుంది.

కిక్కిరిసిన జనం
విపరీతమైన అలజడి
చీటికీ మాటికీ తోపులాట

టిక్కట్లు తీసికొని. బయట పడేసరికి వెంకడికి సగం ప్రాణం పోయింది. బట్టలు చిరిగిపోయాయి. ఒళ్ళంతా చెమట్లు కారుతున్నాయి. జుత్తంతా పిచ్చిక గూడులా తయారయింది. బట్టలు చిరిగినా, ఒళ్ళు గీరుకుపోయినా. కాళ్ళు నొప్పెట్టినా బాధగా లేదు. టిక్కట్లు దొరికాయి.

అది చాలు.

**బ్లాక్ మార్కెటీర్ల చేతుల్లో టిక్కెట్టు కట్టలున్నాయి. వాళ్ళకీ థియేటరు వాళ్ళకీ అవినాభావ సంబంధం ఉండాలి లేకుంటే వాళ్ళ చేతుల్లోకి అన్ని టిక్కెట్లు ఎలా వచ్చాయి? 'మనిషికి రెండు టిక్కెట్లు' బోర్డు మాటేమిటి? నల్లవ్యాపారం వర్థిల్లడం ఎలా? చీకటిని అరికట్టగల శక్తి ఏది?**

రెండు క్లాసు టిక్కట్లు. పది రూపాయల పెట్టుబడి. నలిగిన టిక్కెట్లను సాపుచేసి. జేబులో జాగ్రత్తగా పెట్టుకున్నాడు.

వెంకడికి మొదటిరోజే సినిమా చూడాలనే పిచ్చిలేదు క్లాసు టిక్కెట్టు తీసుకొని, వినోదం కొనుక్కొనే తాహతూ లేదు. అయితే?

బ్లాకులో అమ్మి డబ్బులు సంపాదించడంకోసమే రెండు టిక్కెట్లు తీశాడు. ఆ డబ్బుతో ఇంట్లో మంచంపట్టిన నాలుగో బిడ్డకి వైద్యం చేయించాలనే మధ్యాహ్నం నుండి థియేటరు దగ్గర పడిగాపులు పడుతున్నాడు. ఇప్పుడు టిక్కట్లు త్వరగా అమ్మాలి అంతకన్న త్వరగా మందులుకొని తీసుకెళ్ళాలి.

మూడు రోజుల్నుంచి జ్వరం కాస్తుంది. పిల్లాడికి ఒంటిమీద తెలివుండటంలేదు. పొద్దున్నే వీధిలో ఓ డాక్టరు బాబుకి చూపిస్తే అర్జంటుగా పట్టుకురమ్మని చాలా మందులు రాశాడు. అందులో సూది మందుకూడా ఉంది. లేకపోతే పిల్లాడు దక్కడని చెప్పాడు. జబ్బు పోవాలంటే డబ్బు కావాలి.

ఎలాగ?

ఇరుగూపొరుగూ పిల్లవాణ్ని పెద్దాసుపత్రికి తీసుకుపొమ్మన్నారు. వెంకడికి యిష్టంలేదు. పెద్దాసుపత్రికి వెళ్ళిన వాళు పెద్దల్లో కలిసిపోతారని. వాళ్ళు తిరిగి ఇంటికి చేరుకోరని అతని భయం. అతని తండ్రి అటునుండి అటే కాటికెళ్ళి పోయాడు. మొదటి పెళ్ళాం ఆసుపత్రిలోనే కుర్ర డాకర్ల చేతుల్లో పోయింది. ఇంకా తనకి తెలుసున్న చాలామంది అక్కడకెళ్ళే ప్రాణాలు పోగొట్టుకున్నారు.

అందుకే—

పిల్లల్ని పెద్దాసుపత్రి తీసుకెళ్ళటానికి తను ఒప్పుకోలేదు. మందులుకోసం చాలా మంది దగ్గర చెయ్యి చాపాడు. నెలాఖరురోజులు 'లాభం లేదు' పొమ్మన్నారు

ముసల్ది అంటే వెంకడి తల్లి వీధిలో వాళ్ళదగ్గరా వీళ్ళదగ్గరా అడుక్కుంటుంది. ఆ ముషిలో అప్పుడూ యిప్పుడూ మిగిలిన చిల్లర వెనకేస్తుంది. అలా మిగిల్చిన పైసా పరకా-పది రూపాయలవరకు ఉంటే. కొడుకు చేతిలో పోసింది. మందులు కొనటానికి పదీపరకా చాలవు. చాలా డబ్బులు కావాలి.

అయిడియా!

ఉన్న పదిరూపాయల చిల్లర తీసుకొని. థియేటరుకి పరుగుతీశాడు.

• • •

క్లాసు టిక్కట్లు అయిపోయాయి.
బుక్కింగు మూసారు

బ్లాకులో టిక్కట్లు కొనటానికి చాలమంది ప్రేక్షకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

సినిమా చూడకుండా వెనక్కి వెళ్ళడమంటే మనకి ఎంత నామోషీ. మొదట్నుంచి మన సంస్కృతి వేరు. కళలంటే మనకి అపారమైన గౌరవం. ప్రక్రియ మారుతుందేమోగాని 'కళ' అనేది శాశ్వతం. ఎందరో రాజపోషకులున్నారు.


"ఇందులో ఎన్టీయార్, ఏయన్నారున్నారు సార్....ఫస్టు క్లాసు స్టంటుబొమ్మ సార్.... అయిపు టిక్కెట్లు ముప్పయి అవుద్ది.... లైకయితే తీసుకోండి. బేరాలాడకండిసార్..." జిడ్డుకంపు కొడుతున్న కాకీ బట్టల్లో ఉన్న ఓ కుర్రాడు క్లాసు బాబుల్ని సునాయాసంగా కసిరిపారేస్తున్నాడు.

"ప్లీజ్.... ట్వెంటీఫైవ్ చేసుకొండి రెండు టిక్కెట్లు యివ్వండి. ఫ్యామిలీతో వచ్చానండీ...." మోడరన్ సొసైటీ ప్రతినిధి ఒకరు అభ్యర్థిస్తున్నాడు.

బ్లాక్ మార్కెటీర్ల చేతులో టిక్కెట్టు కట్టలున్నాయి. వాళ్ళకీ థియేటరు వాళ్ళకీ అవినాభావ సంబంధం ఉండాలి. లేకుంటే వాళ్ళ చేతుల్లోకి అన్ని టిక్కెట్లు ఎలా వచ్చాయి? 'మనిషికి రెండు టిక్కెట్లు' అన్న బోర్డు మాటేమిటి? నల్లవ్యాపారం వర్థిల్లడం ఎలా? దేశం అంతటా వ్యాపించిన చీకటిని అరికట్టగల శక్తి ఏది? ఇవన్నీ ప్రశ్నలు ప్రశ్నలుగానే ఉంటాయి.

పోన్లెండి....

ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు దోచుకుంటు




న్నారు. కాబట్టి—ఇక్కడ ఎక్కువ ధరకి టిక్కెట్లు అమ్ముకోవడం 'అవినీతి' అనడం సబబుకాదు. అవినీతి వల్లనైనా మూడుపూటలు తినగలిగే వాళ్ళు కొందరుంటే—ఆ పదిలు గడ్డికెక్కేవాళు మరికొందరు.

రాజపోషకులు బ్లాక్ మార్కెటీర్‌ల చుట్టూ గుమికూడుతున్నారు.

రకరకాలైన అభ్యర్థనలు
ఎన్నో ముక్తాయింపులు
మరెన్నో మర్యాదలు
ఇట్స్ మేడ్ మేడ్ మేడ్ వరల్డ్

వెంకడు జేబులో ఉన్న రెండు టిక్కెట్లు బయటకు తీశాడు. అతని వేషం బాగా సహకరిస్తుంది. చేతిలో టిక్కెట్లు కనిపించగానే అతన్ని చుట్టుముట్టారు ప్రేక్షక మహాశయులు. టిక్కెటు ముప్పయికి తక్కువ యివ్వనన్నాడు, తెచ్చిపెట్టుకున్న గంభీరంతో.

అన్నట్లు–

పోలీసులు ఎక్కడున్నారని ఆలోచించకండి. ఈ సంరంభంలో వాళ్ళ పాత్ర కీలమైనది గాని ప్రస్తుతం వాళ్ళు దూరంగా తప్పించుకు తిరుగుతున్నారు. కమీషను వ్యాపారంతో టర్మ్స్ అండ్ కండిషన్స్‌కి ఎప్పుడూ వాళ్ళు కట్టుబడి ఉంటారు.

హాలుబయట హౌసుఫుల్ బోర్డుపెట్టారు.

నో బార్గెయిన్

చెప్పిన ధరకుచప్పున టిక్కెటు తీసుకుంటున్నారు. ది గ్రేట్ సినీ గోయర్స్. బయట టిక్కెట్లు అమ్ముతున్న కుర్రాళ్ళు మంచి హుషారుగా ఉన్నారు.

ఒక్కక్షణంలో బేరం తిరుగుతుంది. వెంకడి చేతిలో అరవై రూపాయలు పడితాయి. జేబులో డబ్బు రెపరెప లాడుతున్నట్లు పీఃవుతున్న వెంకడ్ని ఎవరోపిలిచారు.

వెంకడు తిరిగి చూశాడు. తనవేపే ఒరుసుస్తూ వస్తున్న అయ్యగారి కారు డ్రయివరు చలమయ్య కనిపించాడు.

"అమ్మా" రచ్చించావురా .. నీ దగ్గర టిక్కెట్లున్నాయన్న మాట నిడరాజబూ .... నవరా ... వెంకడి రెక్కపట్టుకుని పక్కకి బరబరా తీసుకుపోయాడు. వెంకడి గుండెలో బండపడింది.

"సార్! ఈడికాడ క్లాసు టిక్కెట్లే వున్నాయి....వర్రీలేదు. మీరూ అమ్మగారూ ఎళ్ళండి ... ఆటయ్యా మైటికి కారుతెస్తాను. వెంకడి గొంతు తడారిపోయింది.

"అయ్యగారు" అని పిలవబడే అతను వెంకడు పనిచేస్తున్న ఆఫీసుకి అధికారి ప్రతిరోజూ ఓ మూడు గంటలు ఆఫీసు ఈడుస్తున్నందుకు నెలకి నూటఇరవయ్యారూపాయలు-ఆ అయ్యగారి చేతులమీదుగా వెంకడు అందుకుంటున్నాడు.

అయ్యగారు అమ్మగారితో సహా కారు దిగారు.

వెంకడి చేతిలోఉన్న రెండు టిక్కెట్లను అయ్యగారు—ఒకమాట చెప్పకుండా, ఒకిపైసా యివ్వకుండా లాక్కున్నారు. అది అయ్యగారి ప్రత్యేకత. ఆ ప్రత్యేకతముందు వెంకడికళ్ళతో కనిపించడంలేదు.

మద గజద్వయం హాల్లోపలికి కదిలింది.

చలమయ్య కారుగేరు మార్చి, బయటకు దారి తీశాడు.

జబ్బుతో మంచంపట్టిన కొడుకు ఎగశ్వాసతో ప్రాణం విడవటానికి రెపరెప కొట్టుకుంటున్నట్లు కళ్ళముందు దృశ్యం కనిపిస్తూసరికి వెంకడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ✱